క్లుప్తంగా

పేదరిక నిర్మూలనకు కృషి చేద్దాం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైకేపీ సిబ్బంది

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పని చేద్దామని ఏపీఎం తిప్పన్న సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీఎం .తిప్పన్న, సీసీలు, వీఓఏలకు ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బ్యాంకులు, సీఐఎఫ్, శ్రీనిధి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు విరివిగా అందించాలన్నారు. సంఘాల సభ్యులకు చిరు వ్యాపారాల నిర్వహణ, చేతి వృత్తులు, స్వయం ఉపాధిపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. వీఓఏలు మహిళా సంఘాల సభ్యులకు వచ్చిన ఆదాయంలో పొదుపు ఎలా చేయాలో తెలియజేయాలన్నారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

మడకశిరరూరల్: స్థానిక ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ సంయుక్తంగా రిసెప్షనిస్టకం కంప్యూటర్ ఆపరేటర్, బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ హేమలత, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ ఆపైన చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. నాలుగు నెలలు పాటు శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 9966682246 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్

మడకశిరరూరల్: జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ భాస్కర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం నాడు-నేడు ద్వారా జరుగుతున్న పాఠశాల అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ గదుల నిర్మాణాలను పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం భూతన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

అమరాపురం: హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు తమ ఇంటి వద్దనే ఈ కేవైసీ చేయించుకోవాలని సాయిదుర్గా హెచ్‌పీ గ్యాస్ ఏజేన్సీ నిర్వాహకులు జీబీ.శివకుమార్ తెలిపారు. ఈ కేవైసీ చేయించుకోవడానికి ఎలాంటి నిర్దిష్టమైన తేదీ లేదని, ఇది నిరంతరం జరుగుతుందన్నారు. వినియోగదారులు గ్యాస్ కార్యాలయం చుట్టు తిరగాల్సిన అవసరం లేదన్నారు. తమ ప్రతినిధులు వినియోగదారుల ఇంటి వద్దకే వచ్చి ఈ కేవైసీ చేస్తారన్నారు. ఇందుకు నగదు చెల్లించనవసరం లేదన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

అమరాపురం: మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ భాస్కర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ బిల్లులపై ఉపాధి హామీ సిబ్బందితో చర్చించారు. ఈనెల 5న ప్రజావేదికలో వెల్లడైన అంశాలు, బాధ్యుల నుంచి మొత్తాన్ని రికవరీ చేశారా తదితర వివరాలను ఏపీఓ జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. మెట్ట భూముల్లో రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం, మల్బరీ రైతులకు సబ్సిడీ, తదితర వాటికిపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లెదర్‌పార్కును ప్రారంభించాలి

మడకశిర: ఆర్ అనంతపురం వద్దనున్న మినీ లెదర్ పార్కును ప్రారంభించేలా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చొరవ తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మినీ లెదర్ పార్కు భవనం కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. మడకశిర సమీపంలో సెజ్‌కు సేకరించిన 1,600 ఎకరాల భూముల్లో మెగా లెదర్‌పార్కు ఏర్పాటు కోసం 500 ఎకరాలు భూ కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య లోపం..ప్రజలకు శాపం



చిలమత్తూరు దిగువ బస్టాండ్ వద్ద ఉన్న ట్యాంక్‌లో పేరుకుపోయిన పాచి, పురుగులు



బీసీ కాలనీలో డ్రైనేజీ దుస్థితి



బీసీ కాలనీ వద్ద పేరుకుపోయిన చెత్త

- చిలమత్తూరులో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- ఎటు చూసినా పేరుకుపోయిన చెత్త
- ముందుకు కదలని మురుగు

చిలమత్తూరు: పారిశుధ్య లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. పారిశుధ్య నిర్వహణ అటకెక్కడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వివరాల్లో కెళితే.. చిలమత్తూరులో పారిశుధ్య అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా మురుగునీరు దర్శనమిస్తోంది. రోజూ వారి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తచెదారం పేరుకుపోయింది. చిలమత్తూరు బీసీకాలనీలో డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి పిచ్చిమొక్కలు కూడా మొలవడంతో ఇళ్ల నుంచి వచ్చేనీరు రోడ్డుపైనే ప్రవహించే పరిస్థితులు నెలకొన్నాయి. దుర్వాసనతోపాటు, ఈగలు, దోమల బెడద ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే డయేరియా కారణంగా పదుల సంఖ్యలో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.

అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంక్

చిలమత్తూరు దిగువ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న తాగునీటి ట్యాంక్ అపరిశుభ్రంగా మారింది. రోగాలు ప్రబలుతున్నా కనీసం ట్యాంక్‌ను శుభ్రం చేసిన పాపాన పోలేదు. దీంతో ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీటిపై పాచి, పురుగులు దర్శనమిస్తున్నాయి. అవే నీటిని ప్రజలు తాగునీరు, వంటల్లో వినియోగించుకుంటున్నారు.దీంతో రోగాలు వేగంగా ప్రబలుతున్నాయి.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

మండల కేంద్రంలో ఎటు చూసినా పారిశుధ్య నిర్వహణా లోపం కనిపిస్తోంది. జనావాసాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాల్సి ఉన్నా అరకొర పనులు చేయిస్తూ అధికార యంత్రాంగం చేతులు దులుపుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం వద్ద మురుగునీరు ఏరులై పారుతోంది. దీంతో హాస్టల్‌లో దోమల వ్యాప్తి పెరిగిపోయింది. సమస్య తెలిసీ పంచాయతీ కార్యదర్శి తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

పారిశుధ్యంపై అలసత్వాన్ని సహించం

ప్రజారోగ్యం కాపాడటానికి పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ చేస్తున్నాం. పారిశుధ్య నిర్వహణలో రాజీ పడే ప్రసక్తే లేదు. గ్రామల్లో ఎక్కడికక్కడ పారిశుధ్య పనులు చేస్తున్నాం. మండల కేంద్రంలో పారిశుధ్యం దృష్టి పెడతాం. కార్యదర్శి అలసత్వంగా ఉంటే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఈఓఆర్డీతో మాట్లాడి సమస్య పరిష్కారిస్తాం.

– రామ్‌కుమార్, ఎంపీడీఓ, చిలమత్తూరు

బాల్య వివాహాలు అనర్థదాయకం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లీలావతి

మడకశిరరూరల్: బాల్య వివాహాలు అనర్థదాయకమని వక్తలు పేర్కొన్నారు. కల్లుమర్రి జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్యవిహాలు అరికడదాం- ఆడబిడ్డలను కాపాడుదాం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లఘు చిత్రాల ద్వారా ప్రస్తుతం సమాజంలో అమ్మాయిలకు ఎదురయ్యే సమస్యలు, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కొవాలో ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక,శారీరక ఒత్తిడికి గురికావడంతో పాటు ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాపాయం ఉంటుందన్నారు. బాలికలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయడం ఉత్తమన్నారు. ఎంఈఓ నరసింహమూర్తి మాట్లాడుతూ బాలబాలికలు బాల్యవివాహాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తుంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112 లకు సమాచారం అందిస్తే ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, హెచ్‌ఎం కృష్ణమోహన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఉపాధ్యాయులు ఎస్తేర్‌రాణి, మాధవిలత, వీఆర్‌ఓ మురళికృష్ణ, సంస్థ కౌన్సిలర్ బ్రాహ్మణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలంలో నిర్మాణాలు తొలగించొద్దు



మున్సిపల్ కమిషనర్‌కు వినతపత్రం అందిస్తున్న నాయకులు

హిందూపురం: టెండర్ ద్వారా వ్యాపారులు ఆర్టీసీ ఖాళీ స్థలాల్లో షెడ్లు నిర్మించుకున్నారని, వాటిని తొలగిస్తామనడం అన్యాయమని రాజకీయ పార్టీల వేదిక నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు మున్సిపల్ కమిషనర్, ఆర్టీసీ డీఎంకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఉన్నఫలంగా షెడ్లను తొలగిస్తే వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వీటి ద్వారా ఆర్టీసీకి ఏడాదికి రూ.10 లక్షల దాకా ఆదాయం వస్తోందన్నారు. అద్దెలు చెల్లిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఆర్టీసీ సంస్థపై ఉందన్నారు. కాంగ్రెస్ నేత శ్యామ్ కిరణ్, బీఎస్పీ శ్రీరాములు, ఆర్‌ఎస్‌పీ ఏ.శ్రీనివాసులు, ఎంఎస్ఎఫ్ఐ లాయర్ రవికుమార్, ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ నౌషాద్, దళిత సమాఖ్య నాయకులు నారాయణ, గోపాల్, నారాయణ, వ్యాపారులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నల్లగొండ్రాయనపల్లి క్రాస్ వద్ద సర్వే నంబరు 700లో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుడిసెలను మంగళవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు తొలగించారు. సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి, సహాయ కార్యదర్శి చాంద్ బాషా అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతోనే వాటిని తొలగించినట్లు తహసీల్దార్ అంజనాదేవి తెలిపారు. అనంతరం సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని వంట వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. పేదల గుడిసెలు వేసుకుంటే అధికారులు దౌర్జన్యంగా కూలగొట్టడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. ఘటనపై హై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. సీపీఐ నాయకులు వినోద్‌కుమార్, కాటమయ్య, ఇస్మాయిల్, గోవిందరెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పేరుతో ప్రభుత్వం నాటకం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం నూతన ఉచిత ఇసుక విధానం పేరుతో నాటకం ఆడుతోందని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే ప్రజలకు పూర్తిగా ఇసుకను ఉచితంగా అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అయితే ప్రజల నుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పన్నులు, రవాణా చార్జీలు, నిర్వహణ ఫీజుల పేరుతో డబ్బు వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక విధానం టీడీపీ నాయకులు దోచుకోవడానికి ఉపయోగపడుతుందని విమర్శించారు.ఉచితంగా ఇసుక అందిస్తామని చెప్పి ఈరోజు డబ్బులు వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రజల నుంచి పైసా వసూలు చేయకుండా ఇసుకను సరఫరా చేయాలని లేకపోతే ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై తిరగబడడం ఖాయమని హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శి నిజాయితీ



మొబైల్ అందిస్తున్న దృశ్యం

మడకశిర: గుడిబండ మండలం రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప తన నిజాయితీని చాటుకున్నారు. వివరాలు.. మడకశిరలోని ఓ హోటల్ వద్ద గుడిబండ మండలం హిరేతుర్పి గ్రామానికి చెందిన మహలింగప్ప అనే వ్యక్తి మంగళవారం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు.ఈ ఫోన్ రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి గోవిందప్పకు దొరికింది. ఆయన వెంటనే మడకశిర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డికి అప్పగించారు. ఏఎస్ఐ తక్షణమే స్పందించి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. గోవిందప్ప చేతుల మీదుగానే ఫోన్‌ను మహలింగప్పకు అందించారు.

కన్నడ అభివృద్ధికి కృషి చేయండి

పావగడ: కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కేఎస్ సిద్ధలింగప్ప పిలుపు నిచ్చారు. స్థానిక ప్రభుత్వ పీయూ కళాశాలలో నిర్వహించిన తాలూకా స్థాయి ఆజీవ సభ్యుల సభలో ఆయన మాట్లాడారు. స్థానిక కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, కసాప జిల్లాకార్యదర్శి డా యోగీశ్వరప్ప, కంటలకెరె సణ్ణ హొన్నయ్య, తాలూకా కార్యదర్శి ఐఏ నారాయణప్ప సభ్యులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవికి విశేష పూజలు

రొళ్ల: రత్నగిరి గ్రామంలోని కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ అమ్మవారికి భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వడి బియ్యం కట్టి, గాజులు, పూలతో పాటు వెండి, బంగారు ఆభరణాలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు.

నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

హిందూపురం టౌన్: స్థానిక సీతారామ ఆలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం కన్వీనర్ నాగరాజు, రాష్ట్ర కో కన్వీనర్ గంగాధర్, రాయలసీమ కన్వీనర్ ధనుంజయ్, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరయ్యారు. ఈసందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడిగా నరసింహమూర్తి, అధ్యక్షుడిగా మంజునాథ్, ప్రధాన కార్యదర్శిగా చంద్ర, ఉపాధ్యక్షులుగా నగేష్, హర్షిత్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా హరీష్ కుమార్, నవీన్, జాయింట్ సెక్రటరీలుగా మంజు, రమేష్, ప్రచార కార్యదర్శులుగా మంజునాథ్, ప్రేమ్ కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం నాయకులు నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు రాజకీయ చైతన్యవంతులు కావాలన్నారు. ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో నాయీ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్, రామకృష్ణ, రామాంజనేయులు, అక్కమ్మ, త్యాగరాజు, నగేష్, కదిరి రామకృష్ణ, సద్దానప్ప, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ మహమ్మారిని అరికట్టండి



కేడీపీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: డెంగీ మహమ్మారిని అరికట్టడానికి ఆరోగ్య శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేశ్ సూచించారు. స్థానిక తాలూకా సమితి మీటింగ్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కేడీపీ త్రైమాసిక సభలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డెంగీ మహమ్మారి విస్తరిస్తోందని, జీకా వైరస్, ఎలుక జ్వరం ప్రబలుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛతపై దృష్టి సారించాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాశయం నుంచి పావగడ కు తరలి వస్తున్న తాగునీటి పై సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరతపై బీఈఓతో సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వెంటనే ఉపాధ్యాయులను నియమించడానికి సంబంధిత మంత్రులతో మాట్లాడతానని తెలిపారు. రింగ్ రోడ్డు నిర్మాణం, డిప్లొమా కళాశాల ఏర్పాటుకు కావాల్సిన స్థలంపై ఆరా తీశారు. ఈఓ జానకిరాం, తహసీల్దార్ వరదరాజు, పిడబ్ల్యూ ఏఈఈ అనిల్ కుమార్, నీరావరి ఏఈఈ హనుమంతయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడా లేకుండా సరుకులు అందజేయాలి



రేషన్ బియ్యం వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

రొళ్ల: గ్రామాల్లో రేషన్ షాపులు, కిరాణా షాపులతో పాటు వివిధ అంగళ్ల యజమానులు వినియోగదారులకు తూకాల్లో తేడా లేకుండా నిత్యవసర సరుకులు అందజేయాలని హిందూపురం తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం పిల్లిగుండ్ల, అలుపనపల్లి, దొడ్డేరి ఎఫ్‌పీ షాపుల్లో అందిస్తున్న సరుకులతో పాటు గ్రామాల్లోని అంగళ్లను స్కేళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతు తూకాల్లో తేడాగా సరుకులు పంపిణీ చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు. ఏడాదికి ఒకసారి స్కేళ్ల రిపేరీ చేయించుకోవడంతో పాటు వాటికి సీలు వేయించుకోవాలని సూచించారు. ప్రజలు సరుకుల పంపిణీ విషయంలో తేడా కనిపిస్తే తూనికల కొలతల శాఖ అధికారులకు పిర్యాదు చేయవచ్చున్నారు.

హత్య కేసు నిందితులను శిక్షించాలి



సతీష్‌కుమార్ కుటుంబానికి నగదు అందిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్త సతీష్‌కుమార్ హత్యకేసు నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ నియోజకవర్గ నేత చౌళూరు మధుమతిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె గోళాపురం చేరుకుని సతీష్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆమె వారికి భరోసా ఇచ్చారు. అనంతరం రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దారుణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలనికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి, సర్పంచ్ దేవరాజు, నంజప్ప, నాయకులు సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రంగనాథ్, నారాయణరెడ్డి, గోపాల్ రెడ్డి, లోకేష్ రెడ్డి, అనిల్, బాబురెడ్డి, మజీద్, సుధాకర్, గంగాధప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

పావగడ: అడవులను సంరక్షించే బాధ్యత అందరూ తీసుకోవాలని బీఈఓ ఇంద్రాణమ్మ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా వసతి పాఠశాల ఆవరణలో శమి వృక్ష అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విశ్వ పర్యావరణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. అడవులను నాశనం చేస్తే మానవాళి నశించిపోతుందన్నారు. స్థానిక జెడ్పీ మాజీ సభ్యురాలు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సీఈటీ, నీట్ ప్రవేశ పరీక్షల కోర్సులను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 15 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శమి వృక్ష అభివృద్ధి ట్రస్ట్ కార్యదర్శి సత్య లోకేశ్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రమ్మ, రామమూర్తి స్వామిజీ, శ్రీధర్ గుప్త, మానం శశి కిరణ్ పాల్గొన్నారు.

నిందితుడి గుర్తింపు

చిలమత్తూరు: వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని మహానేత విగ్రహానికి వేసిన పూలమాలలను గుర్తు తెలియని వ్యక్తి తెంపేశాడు. కొపుచెన్నంపల్లికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు ధనుంజయ ఈ ఘటనకు ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితుడు స్టేషన్ నుంచి తప్పించుకున్నట్లు కానిస్టేబుల్ రవికుమార్ తెలిపారు.

నేలకూలిన విద్యుత్ స్తంభం



చేనేపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

చిలమత్తూరు: చేనేపల్లిలో ప్రభుత్వ పాఠశాల వద్ద మంగళవారం ఓ వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. పాఠశాల జరుగుతున్న సమయంలో ఇలాంటి ఘటన జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు.

పూడికతీత పనులు ప్రారంభం



చెరుకూరు చెరువులో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రొద్దం: చెరుకూరు గ్రామ చెరువులో మంగళవారం టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పూడికతీత పనులను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ కోసం రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కింద రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో 16 గ్రామాల్లో నీటి వనరుల మరమ్మతు పూడికతీత పనులు చేపడుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా రొద్దం మండలం కోగిర, శ్యాపురం, కంబాలపల్లి బీదానిపల్లి, రాచూరు, దొడగట్ట, చెరుకూరు గ్రామాల్లో పనులు చేపడతామన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి ఆవశ్యకతపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సహవ్యవస్థాపకులు గంగూలి, రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరి శ్రీకాంత్, ప్రతినిధులు జి.మహేష్, రమేష్, సుకన్య, కో ఆర్డినేటర్లు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి చేయండి



రత్నగిరిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఈఓఆర్డీ క్రిష్టప్ప

రొళ్ల: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలని ఈఓఆర్డీ క్రిష్టప్ప సూచించారు. మంగళవారం రత్నగిరి గ్రామంలో పారిశుధ్య కార్మికులతో మురుగు కాలువలు, రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులు, కొళాయిల చుట్టు మురుగునీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో వాటర్ స్కీమ్ పైప్‌లైన్ లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. మంచినీరు కలుషితమైతే డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. సర్పంచ్ చిన్నరంగప్ప, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి అనురాధ

హిందూపురం టౌన్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జలుబు, దగ్గు, జ్వరము, మలేరియా, టైఫాయిడ్, డెంగీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే పరిశుభ్రమైన ఆహారం, వేడినీరు సేవించడం, దోమ తెరలు వాడడం, వారంలో ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా వ్యాధులు నివారించవచ్చునని తెలిపారు. అనంతరం విద్యార్థులను పరీక్షించి వారికి కావాల్సిన మందులు పంపిణీ చేశారు.